క్లుప్తంగా

రైల్వే నిబంధనలు పాటించాలి

కంబాలచెరువు: రైల్వే ట్రాక్‌లు దాటడం నిషేధమని, ట్రాక్‌ల వద్ద సెల్ఫీలు తీసుకోవడం అత్యంత ప్రమాదమని రైల్వే భద్రతా అధికారులు అన్నారు. ఈ మేరకు బొమ్మూరులోని జీఎంఆర్ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఆ వివరాలను ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ .బి.సైదయ్య తెలిపారు. రైలు వచ్చేటప్పుడు సెల్ఫీలు తీసుకోవడం, రైళ్లపై రాళ్లను విసరడం, ఎల్‌సీ గేట్ల వద్ద తీసుకునే చర్యలను వివరించారు. అలాగే కడియం రైల్వే స్టేషన్ సందర్శించి రైల్వే ఉద్యోగులు, గ్యాంగ్ మెన్‌తో మాట్లాడారు. కార్యక్రమంలో రైల్వే భద్రతా అధికారులు వి.శ్రీనివాస్ కుమార్, ఎండీఆర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

28న వాహనాల వేలం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రాజమహేంద్రవరం సౌత్‌స్టేషన్ పరిధిలో సారా, ఇతర నేరాల్లో పట్టుకున్న 30 మోటారుసైకిళ్లకు ఈనెల 28వ తేదీ ఉదయం 8 గంటలకు స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. వివరాలకు 97014 20639, 96187 33879 నంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ధవళేశ్వరం: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో ధవళేశ్వరంలోని పలు ప్రాంతాల్లో శనివారం సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఇండస్ట్రియల్ కాలనీ, ఎర్రకొండ, ఇనోసాల్ట్, రత్నా ట్యూబ్స్, మంతెన ఆశ్రమం, బత్తిన సుబ్బారావు కాలనీ తదితర ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం కలుగుతుందన్నారు.

రూ.40 వేలు మాయం

కంబాలచెరువు: బ్యాంకు నుంచి లింక్ వచ్చిందని క్లిక్ చేస్తే తన ఖాతాలోని రూ.40 వేలు మాయమయ్యాయని బి.సత్యనారాయణమూర్తి శుక్రవారం మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సిద్ధార్థనగర్‌కు చెందిన సత్యనారాయణ సెల్‌ఫోన్‌కు గతేడాది సెప్టెంబర్‌లో ఒక లింక్ వచ్చింది. ఎస్‌బీఐ యోనో యాప్ వాడుతున్నారు, అప్‌డేట్ చేసుకోవాలని ఉంది. ఆ లింక్ క్లిక్ చేయగానే సొమ్ము మాయమైంది.

వ్యక్తి ఆత్మహత్య

కంబాలచెరువు: స్థానిక లలితానగర్‌కు చెందిన వీర వెంకట వరప్రసాద్ (46) ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి మానసికస్థితి సరిగ్గా లేకపోవడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన వరప్రసాద్ ఇంటిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

సీటీఆర్ఐ: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని అన్నారు. స్థానిక 9వ డివిజన్‌లో నగర మహిళ కమిటీ అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, టీడీపీ నాయకులతో కలిసి శుక్రవారం పర్యటించారు.

క్రీడలతో ఒత్తిడి నుంచి ఉపశమనం

- కలెక్టర్ డాక్టర్ మాధవీలత
- ఉత్సాహంగా ఆర్‌ఎంసీ కప్ పోటీలు

ప్రకాశం నగర్: ఉద్యోగులు విధుల్లో ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల అథ్లెటిక్ క్రీడామైదానంలో ఆర్‌ఎంసీ కప్ -2023 క్రీడా పోటీలను శుక్రవారం కలెక్టర్ మాధవీలత, కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ ప్రారంభించారు. క్రీడా జ్యోతితో కలెక్టర్, కమిషనర్, ఇతర నగరపాలక సంస్థ అధికారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో శానిటేషన్, వాటర్ సప్లై, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇంజినీరింగ్, వైద్యం, పరిపాలన తదితర విభాగాలకు సంబంధించి సుమారు 6 వేల మంది ఉద్యోగులు నిత్యం ఎంతో ఒత్తిడి మధ్య విధులను నిర్వర్తిస్తున్నారన్నారు. కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్ ఆర్‌ఎంసీ కప్ -2023 పేరుతో క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. నగరపాలకసంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్ మాట్లాడుతూ శుక్రవారం నుంచి ఆదివారం వరకూ మూడు రోజులు జరిగే ఈ పోటీల్లో నగరపాలక సంస్థ వివిధ విభాగాల నుంచి 523 మంది పాల్గొంటున్నారన్నారు. అనంతరం జెండా ఊపి వంద మీటర్ల రన్నింగ్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు పి.సత్యవేణి, జి.సాంబశివరావు, ఎస్‌ఈ జి.పాండురంగారావు, సిటీ ప్లానింగ్ అధికారి జె.సూరజ్ కుమార్, జిల్లా క్రీడాధికారి శేషగిరిరావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

మొదటి రోజు పోటీలు

టెన్నికాయిట్ (మహిళలు), బ్యాడ్మింటన్ డబుల్స్ (పురుషులు), బ్యాడ్మింటన్ డబుల్స్ (మహిళలు), బ్యాడ్మింటన్ సింగిల్ (పురుషులు), బ్యాడ్మింటన్ సింగిల్ (మహిళలు), కబడ్డీ (పురుషులు), క్యారమ్స్ సింగల్ (పురుషులు), చదరంగం సింగల్ (పురుషులు), క్యారమ్స్ డబుల్ (పురుషులు), క్యారమ్స్ సింగల్ (మహిళలు), వాలీబాల్ సింగిల్ (పురుషులు), ఖోఖో (మహిళలు) విభాగంలో తొలిరోజు పోటీలు జరిగాయి.



గాలిలోకి బెలూన్లు వదిలి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ మాధవీలత, కమిషనర్ దినేష్ కుమార్



మార్చ్ ఫాస్ట్ చేస్తున్న నగరపాలక సంస్థ ఉద్యోగులు



క్రీడాజ్యోతితో మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న కమిషనర్ దినేష్ కుమార్



పరుగుపోటీని ప్రారంభిస్తున్న కలెక్టర్ మాధవీలత

జీపీఎల్ క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రకాశం నగర్: గోల్డ్స్ జిమ్ ప్రీమియర్ లీగ్ (జీపీఎల్) క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం స్థానిక మన్యం గార్డెన్స్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఈ పోటీలను ఎండీ ఆర్వీ చంద్రమౌళి, ఆర్.కావ్య స్పందన ప్రారంభించారు. చంద్రమౌళి మాట్లాడుతూ ఈనెల 26 వరకూ జరిగే పోటీల్లో ఎనిమిది జట్లు పాల్గొంటున్నాయన్నారు. 27న షార్ట్‌పుట్, రిలేరేస్, ఆమ్ రెజ్లింగ్ పోటీలు నిర్వహిస్తామని, మార్చి 3న బహుమతి ప్రదానం ఉంటుందని తెలిపారు. పోటీలను చంద్రభానుసింగ్ పర్యవేక్షిస్తారన్నారు.

ఇంటి పన్నుల వసూలుపై సమీక్ష

కడియం: మండల పరిధిలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్నుల వసూలుపై డీఎల్పీవో జె.సత్యనారాయణ శుక్రవారం సమీక్షించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేమగిరి, కడియం, కడియపులంక గ్రామాల్లో బకాయిలు ఎక్కువగా ఉన్నాయన్నారు. తక్షణం పన్ను వసూలుపై దృష్టి పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. మార్చి 15 నాటికి నూరుశాతం పన్నులు వసూలు చేయాలన్నారు. గ్రామాల వారీగా స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టాలన్నారు. ఈవోపీఆర్‌డీ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గృహసారథులే గ్రామాభివృద్ధికి వారధులు

- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- పార్టీ కార్యాలయంలో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: గృహసారథులు, సచివాలయ కన్వీనర్లే గ్రామాభివృద్ధికి వారధులు అని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. గృహసారథులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పనితీరును అవగాహన చేసుకుని సమయపాలనతో జగనన్నే మా నమ్మకం కార్యక్రమాన్ని ఇంటింటికి వెళ్లి నిర్వహించాలన్నారు. శుక్రవారం వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో బొమ్మూరు, రాజవోలు, పిడింగొయ్యి, హుకుంపేట గ్రామాల వైఎస్సార్ సీపీ గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ మాట్లాడుతూ సీఎం జగన్ అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో వలంటీర్లు నూరుశాతం సఫలీకృతులయ్యారన్నారు. నిబద్ధతతో విధులు నిర్వహించాలని గృహసారథులకు తెలిపారు. కుల, మత, పార్టీలకు అతీతంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమాన్ని అందిస్తోందని, ఈ విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా తెలియజేయాలన్నారు. నిబద్ధత, క్రమశిక్షణతో విధులు నిర్వహించిన గృహసారథులకు భవిష్యత్తులో ఉన్నతస్థాయిని కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారని వెల్లడించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలన్నారు. 2024 ఎన్నికల్లో 175 నియోజకవర్గాలను వైఎస్సార్ సీపీ గెలుచుకునేలా పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామన్నారు. సమావేశంలో వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముద్దాల తిరుపతిరావు (అను), పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

కుడుపూడి అంత్యక్రియలు



అంతిమయాత్రలో పాల్గొన్న జక్కంపూడి గణేష్, పాలిక శ్రీను

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీ మాజీ సర్పంచ్ కుడుపూడి సత్యనారాయణ అంత్యక్రియలు శుక్రవారం ఇన్నీసుపేట కైలాసభూమిలో నిర్వహించారు. ముందుగా ఆయన భౌతికకాయాన్ని భారీ ఊరేగింపుతో తీసుకువెళ్లారు. అంతిమయాత్రలో వైఎస్సార్ సీపీ నాయకులు జక్కంపూడి గణేష్, పాలిక శ్రీను పాల్గొన్నారు. అలాగే సత్యనారాయణ పార్థివదేహాన్ని ఎంపీ భరత్‌రామ్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, డాక్టర్ అనసూరి పద్మలత, కుడిపూడి పార్థసారథి, వాసిరెడ్డి బాబీ సందర్శించి నివాళులర్పించారు. కుడిపూడి మృతికి సంతాపంగా గ్రామంలోని వ్యాపారస్తులు స్వచ్ఛందంగా షాపులు మూసివేశారు. ఆటో కార్మికులు ఆటోలను నిలుపుదల చేశారు.

రాళ్లబండి మ్యూజియానికి మహర్దశ



రాళ్లబండి సుబ్బారావు మ్యూజియంలో ప్రాచీన విగ్రహాన్ని పరిశీలిస్తున్న ఎంపీ భరత్‌రామ్

- నూతన భవన నిర్మాణానికి రూ.10 కోట్ల మంజూరు
- ఎంపీ భరత్‌రామ్ వెల్లడి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగరంలోని ప్రసిద్ధి చెందిన రాళ్లబండి సుబ్బారావు ఆర్కియాలజికల్ మ్యూజియానికి మహర్దశ పట్టింది. జీర్ణావస్థకు చేరిన మ్యూజియం భవన స్థానే ఆధునిక హంగులతో నూతన భవన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం (పురావస్తు శాఖ) రూ.10 కోట్లు మంజూరు చేసిందని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ వెల్లడించారు. శుక్రవారం ఆయన గోదావరి గట్టున ఉన్న రాళ్లబండి సుబ్బారావు పురావస్తు ప్రదర్శనశాల (మ్యూజియం)ను సందర్శించారు. ఈ మ్యూజియంలో సుమారు 9, 10, 11, 12, 13, 14 శతాబ్దాల నాటి ఎన్నో పురాతన వస్తువులను భద్రపరిచారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా రాష్ట్రంలోని అనేక జిల్లాల నుంచి ఈ మ్యూజియంను సందర్శించడానికి విద్యార్థులు, చారిత్రక పరిశోధనా సంస్థల నుంచి ఎందరో వస్తుంటారు. అయితే ఇంత అమూల్యమైన పురావస్తు సంపదను భద్రపరిచే భవనం అతి పురాతనమైనది కావడంతో ఎంపీ భరత్.. కేంద్ర పురావస్తు శాఖకు కొత్త భవన నిర్మాణానికి నిధులు మంజూరు కోరుతూ లేఖ రాశారు. దీనికి సంబంధిత శాఖ సానుకూలంగా స్పందించింది. ఇదే విషయాన్ని ఎంపీ భరత్ శుక్రవారం మీడియాకు తెలిపారు. తొలి విడతగా రూ.4 కోట్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులు పంపిందన్నారు. ప్రస్తుతం ఉన్న భవనాన్ని పూర్తిగా తొలగించి, అదే స్థలంలో కొత్త భవనాన్ని అన్ని హంగులతో అత్యంత అధునాతన విధానంలో జీ ప్లస్ 2 భవనం నిర్మించబోతున్నట్టు చెప్పారు.

కాటన్ మ్యూజియం అభివృద్ధికి చర్యలు

ధవళేశ్వరంలోని సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ నిర్మాణానికి వినియోగించిన యంత్రాలు తదితర నమూనాలతో ఉన్న మ్యూజియాన్ని కూడా అభివృద్ధి చేస్తామని ఎంపీ తెలిపారు. అలాగే పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన కట్టడాల నమూనాలను మ్యూజియంలో ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉందని, దానిని కూడా త్వరలో ఆచరణలో పెట్టబోతున్నట్టు తెలిపారు. ఏపీ టూరిజం అండ్ ఆర్కియాలజీ శాఖ సిబ్బంది, నగర వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, మింది నాగేంద్ర, మార్తి లక్ష్మి, ఎన్‌వీ శ్రీనివాస్, దూర్వాసుల సత్యనారాయణ, బిల్డర్ చిన్న, నందెం స్వామి, రొక్కం త్రినాథ్, కాలే చిన్ని, గణేష్ పాల్గొన్నారు.

25 నుంచి గోదావరి బాలోత్సవం

ప్రకాశం నగర్: స్థానిక ఎస్‌కేవీటీ కళాశాలలో ఈనెల 25, 26 తేదీల్లో గోదావరి బాలోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు ఆహ్వాన కమిటీ ప్రధాన కార్యదర్శి పీఎస్ఎన్ రాజు తెలిపారు. ఇప్పటి వరకు 200 పైగా పాఠశాలల నుంచి నాలుగు వేల మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. అకాడమిక్, కల్చరల్ భాగాలుగా విభజించి 60 పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

జీవకారుణ్య ప్రాంగణంలో స్థలం కేటాయించాలి

సీటీఆర్ఐ: అంధ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తూ రెండు దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న జియోన్ స్కూల్‌కు జీవకారుణ్య సంఘం ప్రాంగణంలో స్థలం కేటాయించాలని రాజమహేంద్రి గోదావరి సంరక్షణ సమితి చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జియోన్ స్కూల్‌ను తరలించే విషయంలో వారికి న్యాయం చేయాలన్న దానిపై ప్రతి ఒక్కరు మద్దతు ఇస్తారన్నారు. అయితే నగరానికి ప్రభుత్వ వైద్య కళాశాల రావడం అనేది చాలా ప్రతిష్టాత్మకమన్నది ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. జియోన్ స్కూల్ తరలింపు చాటున వివిధ రాజకీయపార్టీలకు సంబంధించిన నేతలు ఇష్టానుసారంగా విమర్శలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రే కొండబాబు, పెద్ద, భద్రరావు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

- ఎంపీ భరత్‌రామ్
- 33వ డివిజన్‌లో సమావేశం



మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్, చిత్రంలో నాగార్జున యాదవ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, అందుకు తన వంతు సహకారం అందిస్తానని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. శుక్రవారం నగరంలోని 33వ డివిజన్ గడ్డిరెడ్డివారి వీధి మున్సిపల్ హైస్కూల్ వద్ద వైఎస్సార్ సీపీ గృహసారథులు, ఆ డివిజన్ మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సహాయం, బ్యాంకుల నుంచి డ్వాక్రా సంఘాలు తీసుకున్న రుణంతో ఎటువంటి వ్యాపారాలు నిర్వహించుకుంటున్నారు, వ్యాపారంలో ఏమైనా ఇబ్బందులు, నష్టాలు తదితర సమస్యలేమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కొన్ని డ్వాక్రా సంఘాలు మాత్రమే వ్యాపార రంగంలోకి అడుగు పెట్టాయని, మిగిలిన సంఘాలు కూడా వీరిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు రావాలన్నారు. నగరంలోని ప్రధాన జంక్షన్లలో డ్వాక్రా, మెప్మా బజార్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు ఎంపీ భరత్ తెలిపారు. ఈ డివిజన్లో మొత్తం 46 డ్వాక్రా గ్రూపులు ఉండగా వాటిలో 36 మాత్రమే రిజిస్టర్ అయ్యాయని, అంటే రమారమి 360 మంది సభ్యులు చురుకైన పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. నగరంలోని పది, పదిహేను సెంటర్లలో సుమారు 150 షాపులు నిర్మించి, అద్దె లేకుండా కేవలం విద్యుత్ చార్జీలు చెల్లించే మాదిరిగా ఏర్పాటు చేయబోతున్నట్టు ఎంపీ తెలిపారు. పార్టీ రాష్ట్ర స్పోక్స్ పర్సన్ నాగార్జున యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, 33వ వార్డు ఇన్‌చార్జి గాదిరెడ్డి పెదబాబు, బొమ్మన జయకుమార్, మజ్జి అప్పారావు, మార్గాని సురేష్, కడియాల లక్ష్మణరావు, ఎస్.బాబురావు, కొత్తా విజయ రాజ్యలక్ష్మి, మారిశెట్టి వెంకటేశ్వరరావు, ముప్పన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి కేసులో ఏడాది జైలు

ధవళేశ్వరం: వ్యక్తిపై దాడి కేసులో ధవళేశ్వరం గ్రామానికి చెందిన వెంపాడ దుర్గారావుకు ఏడాది జైలు, రూ.2 వేలు జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 7వ అదనపు కోర్టు జడ్జి రామకృష్ణ శుక్రవారం తీర్పు ఇచ్చారు. ధవళేశ్వరం సీఐ మంగాదేవి తెలిపిన వివరాల ప్రకారం.. 2019 జూన్ 18న దారపు బంగారయ్యను వెంపాడ దుర్గారావు మసాలా నూరుకొనే రాయితో కొట్టి గాయపరిచాడు. దీనిపై అప్పటి ఏఎస్సై కె.నాగరాజు కేసు నమోదు చేశారు. వాదోపవాదనల అనంతరం శుక్రవారం తీర్పు వెలువరించింది. ఏపీపీ మహాలక్ష్మి వాదనలు వినిపించారు. కేసు దర్యాప్తుకు కృషి చేసిన కానిస్టేబుళ్లు రమేష్, సత్తిబాబును సీఐ మంగాదేవి అభినందించారు.

బంగారు గొలుసు చోరీ

ధవళేశ్వరం: స్థానిక మెయిన్ రోడ్డులోని మరిడమ్మ గుడి ఎదురుగా బెల్లాన హైమావతి శ్రీదుర్గా భవాని కిరాణా షాప్ నిర్వహిస్తోంది. శుక్రవారం మధ్యాహ్నం 1.30 సమయంలో సుమారు 45 ఏళ్ల వ్యక్తి వచ్చి వాటర్ బాటిల్ కావాలని అడిగాడు. బాటిల్ ఇస్తుండగా హైమావతి మెడలోని బంగారపు గొలుసును లాగాడు. అప్రమత్తమైన ఆమె గొలుసును గట్టిగా పట్టుకోవడంతో ఒక ముక్క తెగి అతడి చేతిలోకి వెళ్లింది. అది తీసుకుని అక్కడి నుంచి పరారయ్యాడు. దొంగ లాక్కెళ్లిన బంగారం ఒక కాసు ఉంటుందని పోలీసులు వెల్లడించారు. కేసును ధవళేశ్వరం ఎస్సై వి.క్రాంతికుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక కార్యాచరణ

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి గ్రామపంచాయతీలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి పి.జగదాంబ సచివాలయం, పారిశుధ్య సిబ్బందికి ఆదేశించారు. ఆ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం జగనన్న స్వచ్ఛసంకల్పం, చెత్త నుంచి సంపద తయారీకేంద్రం తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఓ జగదాంబ మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య పరిస్థితులపై, చేపడుతున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి ఎం.రూప్‌చంద్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పరిపుష్టంగా ఇన్నీసుపేట బ్యాంక్

- రిజర్వ్ బ్యాంక్ నింబధనల మేరకే నిర్వహణ
- చైర్మన్ కోళ్లబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్నీసుపేట బ్యాంక్ చైర్మన్ కోళ్ల బాబు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఇన్నీసుపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పరిపుష్టంగా ఉందని, రిజర్వ్ బ్యాంక్ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తోందని ఆ బ్యాంక్ చైర్మన్ కోళ్ల అచ్యుత రామారావు (బాబు) అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది మార్చి 31 నాటికి రూ.128.12 కోట్లు ఉన్న డిపాజిట్లను రూ.134 కోట్లకు పెంచామన్నారు. అడ్వాన్స్‌లు 92.13 కోట్లు అందజేశామన్నారు. రిజర్వ్ బ్యాంక్ నిబంధనలకు అనుగుణంగా డిపాజిట్లలో 70 శాతం మేరకు రుణాలుగా అందజేయవచ్చని, ఇప్పటికీ తాము 69.6 శాతం రుణాలుగా అందజేయడం జరిగిందన్నారు. సీఆర్‌ఏ రేషియో వచ్చే ఏడాది మార్చి నాటికి 12 శాతానికి తీసుకురావాల్సి ఉందని, అందుకే డిపాజిట్లను పెంచాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఇటీవల ఆర్‌బీఐ పలు సహకార బ్యాంకులను పరిశీలించి నిర్వహణ తీరు సరిగా లేని బ్యాంక్‌లకు పెనాల్టీలను విధించిందన్నారు. అయితే ఇన్నీసుపేట బ్యాంక్‌కు ఎటువంటి పెనాల్టీ విధించలేదని, బ్యాంక్ నిర్వహణ తీరు బాగుందని బి గ్రేట్ కేటాయించడం జరిగిందన్నారు. బ్యాంక్‌లో ఎటువంటి అవకతవకలకు తావులేకుండా పాలన సాగిస్తున్నామన్నారు. డిపాజిట్లు పెంచేందుకు తనతో పాటుగా తమ పాలకవర్గ సభ్యులు ముందుకు వచ్చారని, బ్యాంక్‌ను అభివృద్ధి పథంలో నడిపించేందుకు సమష్టిగా పనిచేస్తున్నామన్నారు. సమావేశంలో డైరెక్టర్లు కటారి శ్రీనివాస కన్న, దాది సత్యనారాయణ, జామి సత్యనారాయణమూర్తి, అందనాపల్లి సత్యనారాయణ, పాడిపిరెడ్డి శివ శ్రీనివాసరావు, సన్నీ, కురుమెల్లి స్వరూప్, బ్యాంక్ సీఈవో పి.రమణకుమార్ పాల్గొన్నారు.